## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం



**పాన్‌గల్:** వందేమాతరం ఫౌండేషన్, బాల వారధి అకాడమీ ఆధ్వర్యంలో సంయుక్తంగా చేపట్టిన ఆఫ్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో ట్యూటర్స్‌గా పనిచేసేందుకు గాను నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వందేమాతరం ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ కావేరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్‌తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయంత్రం వేళలో 2గంటల పాటు విద్యార్థులకు వినూత్న పద్ధతిలో విద్య బోధించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్, ఆపై చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 93921 87342 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

### దయాకర్‌రెడ్డికి ఘన నివాళి



**అమరచింత/ఆత్మకూర్:** మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో చిరువ్యాపారుల కోసం దయాకర్‌రెడ్డి షిర్డీసాయి ట్రస్టు పేరిట దుకాణ సముదాయాలను నిర్మించి ఇచ్చారని గుర్తుచేశారు. బీడు భూములను సస్యశ్యామలంగా మార్చేందుకు అమరచింత ఎత్తిపోతల పథకం సాధించి నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. దయాకర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, ప్రభుదాస్, జానిస్ట్, బాలరాజు, దేవరాజు, మాసన్న, సవారన్న, మహిమూద్, కట్టెలమండి రాములు, రామలక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఎస్టీడీ శ్రీను, శ్రీను, వెంకటేష్, లచ్చన్నగౌడ్, కురుమూర్తి, రాములు పాల్గొన్నారు.

### నియామకం



**మదనాపురం:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా మదనాపురం మండలం కొన్నూరుకు చెందిన బుగ్గపల్లి పరమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, ఉప్పల్ ఇన్‌చార్జి మందుమూల పరమేశ్వర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

### చెరువులో పడి వృద్ధుడి మృతి

**వనపర్తి రూరల్:** జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఫిదా హుస్సేన్ (65) చెరువులో పడి మృతిచెందాడు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల మేరకు.. ఫిదా హుస్సేన్ మానసికస్థితి సరిగా లేదు. అతడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి స్థానిక నల్ల చెరువులో చేపలు పడుతూ.. రెండు రోజులకోసారి ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో అతడు బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం నల్ల చెరువులో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిషి మునిసాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### మహిళ మృతిపై అనుమానాలు

**పాన్‌గల్:** మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన మల్లెపు దేవమ్మ (49) గతనెల 3న మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ శుక్రవారం కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. మల్లెపు దేవమ్మ వ్యవసాయ కూలీ. గతనెల 3న ఆమె ఇంట్లోనే మృతిచెందింది. మరుసటి రోజు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆమె మృతిపై కుటుంబ సభ్యులకు అనుమానాలు రావడంతో మృతురాలి కుమారుడు మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూడ్చిన శవానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాలను నివృత్తి చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం

- అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**కొత్తకోట:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. పదేళ్ల పాలనలో కొత్తకోట పట్టణంలో ఒక్క డబుల్‌బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ సంవత్సరం దేవరకద్ర నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా మరో 1,000 ఇళ్లను పేదలకు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విడతల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని.. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చూస్తామన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. అదే విధంగా ఇందిరమ్మ మైనార్టీ మహిళాశక్తి పథకం కింద లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు.

**30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ**

కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కొత్తకోట మున్సిపాలిటీలో ప్రజల అవసరాల మేరకు ఆస్పత్రి నిర్మించలేకపోయిందని అన్నారు. ఎన్నికల సమయంలో హడావుడిగా ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ పేరుతో హంగామా చేశారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ఆరు పడకల ఆస్పత్రిలోనే ఇప్పటికీ ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. ప్రస్తుతం రూ. 5.75కోట్లతో 30 పడకల ఆస్పత్రిని కాంగ్రెస్ హయాంలోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, నాగారపు బీచుపల్లి యాదవ్, మేస్త్రీ శ్రీను, పీజే బాబు, కృష్ణారెడ్డి, ఎన్‌జే బోయేజ్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీబీ రాములు, గోకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### అమరుల కుటుంబాలకు అండగా నిలవాలి

**కొత్తకోట రూరల్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అమర వీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మన్యం కోరారు. ఈ మేరకు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మన్యం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు గుర్తింపుగా గత ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 10లక్షలు ఇవ్వడంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించిందన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా ప్రతి అమరవీరుడి కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలం, ఒకరికి రూ. 25వేల పింఛన్ ఇస్తామని చెప్పిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన కోరారు.

# పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అమరచింతలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శశిధర్

**అమరచింత/ఆత్మకూర్/వీపనగండ్ల/వనపర్తి రూరల్:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అమరచింత మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శశిధర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డులో మురుగు కాల్వల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని కోరారు. అదే విధంగా మండలంలోని మస్తీపురంలో ఎంపీడీఓ చెన్నమ్మ పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలతో దోమలు వృద్ధిచెంది వ్యాధులకు కారణమవుతాయని.. ఎప్పటికప్పుడు నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

➪ ఆత్మకూర్ మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మున్సిపల్ కమిషనర్ శశిధర్ అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

➪ వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయి, మహేశ్వరి, కమల, ఆశావర్కర్లు రాణి, రాధ పాల్గొన్నారు.



వనపర్తి మండలం నాచహళ్లిలో..

➪ వనపర్తి మండలంలోని నాచహళ్లిలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ పాల్గొని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలను సందర్శించి బడిఈడు పిల్లల నమోదు వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నూతన్ పాల్గొన్నారు.

### నేడు మంత్రి పర్యటన

**వీపనగండ్ల:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి కల్వరాళ్ల నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్రలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ఆ తర్వాత సంగినేనిపల్లి గ్రామంలో సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసి.. కల్వరాలలో పర్యటిస్తారని తెలిపారు. మంత్రి పర్యటనలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

**ఖిల్లాఘనపురం:** మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం శుక్రవారం వెంకటాంపల్లి గ్రామస్తులు రూ.లక్ష విరాళం అందించినట్లు ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకువచ్చిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు.



# పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



గోపాల్‌పేట మండలం బుద్దారంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

**సాక్షి నెట్‌వర్క్:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా చేరిన చిన్నారులతో సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి.. చదువులో ఉన్నతంగా రాణించాలని పలువురు ఆశీర్వదించారు. వనపర్తి మండలం మెంటెపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో హెచ్ఎం సునీల్‌కుమార్, గీతారాణి, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పుష్పావతి, డీలర్ అశోక్‌రెడ్డి తదితరులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

➪ పాన్‌గల్ మండలంలోని రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలో చేరిన చిన్నారులతో ఎంఈఓ శ్రీనివాసులు అక్షరభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన రెండో రోజు 60శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, పీఎస్ హెచ్ఎం తిరుపతయ్య పాల్గొన్నారు.

➪ వీపనగండ్ల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సాయిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➪ గోపాల్‌పేట మండలం బుద్దారం ప్రాథమిక పాఠశాలలో మామిడి తోరణాలు కట్టి కొత్తగా చేరిన విద్యార్థులను ఆహ్వానించి.. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజశ్రీ, భాస్కర్, గ్రామస్తులు అచ్చుత రామారావు, వెంకటయ్య పాల్గొన్నారు.



వనపర్తి మండలం మెంటెపల్లి పాఠశాలలో..

➪ ఆత్మకూర్ మండలం మూలమళ్ల పాఠశాలలో నూతనంగా చేరిన చిన్నారులతో ఎంఈఓ బాలరాజు అక్షరాభస్యం చేయించారు. కార్యక్రమంలో సీఆర్పీ సౌమ్యారాణి పాల్గొన్నారు.

➪ ఖిల్లాఘనపురం మండలంలోని ఉప్పరిపల్లి, సోళీపూర్, మల్కాపురం, కమాలుద్దీన్‌పూర్, మానాజీపేట, తెలంగాణ మోడల్ స్కూల్ తదితర పాఠశాలల్లో సామూహిక అక్షరభ్యాసం, పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. మల్కాపురం పాఠశాలలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్ పాల్గొన్నారు.



ఆత్మకూర్ మండలం మూలమళ్లలో..



వీపనగండ్లలో..



మల్కాపురంలో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

# కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**పాన్‌గల్:** మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మాందాపూర్ సబ్‌సెంటర్ పరిధిలో వైద్యబృందం డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయ నిర్ధారణతో పాటు ర్యాండమ్ బ్లడ్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటిస్–బీ మొదలగు పరీక్షలు నిర్వహించి.. అవసరమైన మందులు అందజేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్ఓ రామయ్య సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు నిహారిక, ఎన్టీఓ టీం అలీబాబు, పద్మ, కల్పన, రమాదేవి, హెచ్ఐవీ టీం బండారి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, టీబీ బృందం ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఖాజా, నగేష్, రహమాన్, సిబ్బంది శాంతమ్మ, బుడ్డమ్మ, నిర్మలమ్మ, రాంచంద్రయ్య, సతీష్ పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి



శ్రీరంగాపురం మండలం నాగరాలలో..

**వనపర్తి రూరల్/పాన్‌గల్/ఆత్మకూర్:** భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వనపర్తి మండలం కాశింనగర్‌లో నిర్వహించిన సదస్సులో 218, రాజపేటలో 62, పెబ్బేరు మండలం యాపర్లలో 4, సూగూరులో 36, శ్రీరంగాపురం మండలం నాగరాలలో ఒక దరఖాస్తు అందినట్లు తహసీల్దార్లు రమేశ్‌రెడ్డి, మురళీగౌడ్, బి.రాజు, డిప్యూటీ తహసీల్దార్లు చక్రపాణి, కె.నందకిషోర్ తెలిపారు.

➪ పాన్‌గల్ మండలంలోని శాగాపూర్‌లో 90, చిక్కేపల్లిలో 28 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించిన వారిలో డీటీ అశోక్‌కుమార్, ఆర్ఐలు తిరుపతయ్య, మహేశ్ ఉన్నారు.

➪ ఆత్మకూర్ మండల కేంద్రంతో పాటు సోంసాగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 28 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేశ్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

# సగర సంఘం అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

**పాన్‌గల్:** సగర సంఘం అభివృద్ధికి సభ్యులందరూ సమష్టిగా పనిచేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక సత్యం, జిల్లా ఎన్నికల కమిటీ కన్వీనర్ స్వామి సాగర్, కోకన్వీనర్ తిరుపతయ్య సాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేటలో సగర సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కిరణ్‌సాగర్, ప్రధాన కార్యదర్శిగా దిండి బాలయ్య, కోశాధికారిగా బాలపీర్, గౌరవాధ్యక్షుడిగా గొబ్బూరి కృష్ణయ్య సాగర్, ఉపాధ్యక్షుడిగా కౌకుంట్ల కురుమూర్తి సాగర్‌ను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు సత్యం సాగర్, వీరసాగర్, కృష్ణయ్య, కురుమూర్తి, చంద్రయ్య, నారాయణ, కిరణ్‌సాగర్, శ్రీనివాసులు, రాజుసాగర్, ఆంజనేయులు, సత్యంసాగర్ పాల్గొన్నారు.

### విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



**ఆత్మకూర్:** ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి.. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ బాలరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఖుతుబ్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టులు, షూ, సాక్స్ అమ్మకాలను నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం



**గోపాల్‌పేట:** బీఆర్ఎస్ బలోపేతానికి కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాడిపర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సందీప్, మరో మహిళ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దని.. పార్టీపరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదే విధంగా బుద్దారంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ సోదరుడు నాగయ్య మరణించగా.. అతడి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి



**మదనాపురం:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల మధ్య చదువు నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందిస్తారని.. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి కోరారు. మండలంలోని తిర్మలాయపల్లి రెండో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి యశోద, అంగన్‌వాడీ టీచర్లు రాధ, పద్మ పాల్గొన్నారు.

### హోటళ్లలో మద్యం అమ్మకాలపై ఫిర్యాదు



**వనపర్తి రూరల్:** జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ.. భోజనం పేరుతో హోటళ్లు నడుపుతున్న కొందరు గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. దీంతో మహిళలు భోజనం చేసేందుకు వెళ్లాలంటే జంకుతున్నారన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మిగతా జిల్లాల్లో ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హోటళ్లలో మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

**వీపనగండ్ల:** మండలంలో ఈ నెల 5వ తేదీ వరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ డాకేశ్వర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌తో ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### యువకుడు అదృశ్యం

**వనపర్తి రూరల్:** జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో నివాసముంటున్న లావుడ్య నవీన్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల మేరకు.. వీపనగండ్ల మండలం సంపత్రావుపల్లికి చెందిన లావుడ్య నవీన్‌కు వనపర్తి భగీరథ కాలనీకి చెందిన భూమ ఉమారాణితో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారు భగీరథ కాలనీలోనే నివాసముంటున్నారు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఈ నెల 10న నవీన్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. నవీన్ భార్య భూమ ఉమారాణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

**పాన్‌గల్:** విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొత్తపేటకు చెందిన గంగపురి రాములు తన గేదెలను మేత కోసం గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అందులోని ఓ గేదె మేత మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు ఉన్న కర్రను తగిలింది. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు గేదెపై పడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ. 30వేల వరకు ఉంటుందని.. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.